క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : పట్టణంలో 11కేవీ పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 7.30గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సాయిగణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కనగల్ : ధాన్యం కొనుగోళ్లలో రైతులు నిర్వాహకులకు సహకరించాలని ఏపీఎం సంకు హరి అన్నారు. శనివారం మండల పరిధిలోని జి యడవల్లి ఐకేపీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. యడవల్లి ఐకేపీ కేంద్రంలో కొనుగోళ్ల సజావుగా సాగుతున్నట్లు, ఇప్పటి వరకు ఈ ఐకేపీ కేంద్రం ద్వారా 23,949క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట రైతులు, నిర్వాహకులు ఉన్నారు.

సీఎంను కలిసిన కైలాస్ నేత



సీఎంతో కైలాస్ నేత, నాయకులు

మునుగోడు : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత శనివారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని నియోజకవర్గ బీసీ నాయకులతో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎంకు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం తగిన గౌవరం అందేలా చూస్తానని సీఎం రేవంత్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట బొల్లం వెంకన్న, కాటం వెంకన్న, ఆరేళ్ల సైదులు, మిర్యాల విజయ్, ప్రమోద్, కృష్ణయ్య, ఈడెం చంద్రశేఖర్, నవీన్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కనగల్ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కనగల్ ఆధ్వర్యంలో ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్లబ్ మండల అధ్యక్షుడు నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, సెక్రెటరీ నీలకంఠం శేఖర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కనగల్ పాత ఉమ్మడి గ్రామపంచాయతీలు అమ్మగూడెం, కనగల్, బొమ్మెపల్లి, లచ్చాగూడెం, తిమ్మన్నగూడెం, తేలకంటిగూడెం, తిమ్మాజీగూడెం గ్రామాల విద్యార్థులకు యోగ ప్రాణాయామం, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఐకాన్ ఆస్పత్రి సహకారంతో మెగా హెల్త్ క్యాంపు, గ్రామాల్లో ప్రభుత్వ కొలువులు సాధించిన వారికి సన్మానం ఉంటుందన్నారు.

జగన్‌పై దాడి పిరికిపందల చర్య

నకిరేకల్ : ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌పై దుండగులు రాళ్లతో దాడి చేయడం పిరికిపందల చర్య అని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుడిమిడి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడారు. ఏపీలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్న అక్కసుతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కుమ్మక్కయ్యాయని ధ్వజమెత్తారు. ఎన్ని కుట్రలు చేసినా జగన్ 130 స్థానాల్లో విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నల్లగొండ రూరల్ : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరిప్రసాద్ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని మహాత్మగాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈనెల 15న సూర్యాపేటలో జరగబోయే ఎన్ఎస్‌యూఐ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రితేష్‌రావు, నరేందర్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్ : పెన్షనర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జరిగిన నల్లగొండ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగదు రహిత వైద్యం, పీఆర్‌సీ తదితర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో తాలుకా అధ్యక్షుడు గజవెల్లి సత్యం, కార్యదర్శి యాద వాసుదేవ్, జిల్ల పుల్లయ్య, జి.సుధాకర్, ఎం.శేషారెడ్డి, ఎం.రఘునాథన్, కేశవాచారి, మహేశ్వర్, రమేష్, రంగయ్య, ప్రసాద్, రవి ప్రసాద్, చక్రపాణి, ఆజం అలీ, బాలరాజు, భిక్షం, కృష్ణయ్య, రామలింగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

హరితహారం అభాసుపాలు

- అగ్నికి ఆహుతవుతున్న మొక్కలు.. మరికొన్ని విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని నరికివేత
- పట్టించుకోని ఉన్నతాధికారులు



సరంపేట పల్లెప్రకృతి వనంలో దగ్ధమైన మొక్కలు



రాజాపేటతండాలో నరికివేసిన చెట్లు

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం అభాసుపాలవుతుంది. లక్షలలు వెచ్చించి నాటిన మొక్కలను పట్టించుకునేవారు లేకపోవడంతో అవి నరికివేతకు, అదే విధంగా అగ్నికి ఆహుతవుతున్నాయి. మండలంలో ప్రతియేటా హరితహారంలో భాగంగా లక్షల్లో మొక్కలు నాటిస్తున్న అధికారులు తర్వాత వాటి సంరక్షణను పట్టించుకోవడం వదిలేస్తున్నారు. మొక్కలు నాటినప్పుడు చూపిస్తున్న శ్రద్ధ మొక్కల సంరక్షణపై చూపడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల వ్యాప్తంగా 20గ్రామపంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీలతో పాటు ఆవాస ప్రాంతాల్లో 33 పల్లె ప్రకృతివనాలను ఏర్పాటు చేశారు.

బృహత్ పల్లె ప్రకృతివనంలో..

మండలంలోని సరంపేట గ్రామంలో బృహత్‌పల్లె ప్రకృతి వనాన్ని 2020 సంవత్సరంలో పది ఎకరాల్లో అధికారులు దాదాపు 20లక్షలతో ఏర్పాటు చేశారు. ఈ ప్రకృతివనంలో 30వేల మొక్కలను నాటారు. వాటి బాధ్యత రెండు సంవత్సరాల వరకు ఉపాధిహామీ సిబ్బంది, అనంతరం గ్రామ పంచాయతీ వారు సంరక్షిస్తున్నారు. కానీ ఇటీవల ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వేసిన నిప్పు వేయడంతో ప్రకృతివనంలో దాదాపు 5వేల మొక్కలు దగ్ధమయ్యాయి.

రహదారి పక్కన ఉన్న మొక్కలు సైతం..

మండలంలోని దామెరబీమనపల్లి, లెంకలపల్లి, సరంపేట, రాజాపేటతండా, వట్టిపల్లి, బట్లపల్లి గ్రామాల రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు కూడా అక్కడక్కడ అగ్నికి ఆహుతయ్యాయి. రాజాపేటతండా రహదారి వెంట విద్యుత్ తీగలకు తగులుతున్నాయనే కారణంతో చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించారు. గత 2,3 ఏళ్ల క్రితం మొక్కలను నాటుతున్న సమయంలో కూడా ఆ విద్యుత్ తీగలు అక్కడే ఉన్నాయి. ముందస్తు ఆలోచనలు లేకుండానే విద్యుత్ తీగల గుండా నాడు హడావుడిగా మొక్కలను నాటి అధికారులు, సిబ్బంది చేతులు దులుపుకున్నారు. నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని భావించి పెరిగిన మొక్కలను నరికివేస్తుండడంతో గతంలో మొక్కలు నాటించిన అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుని మొక్కల సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్త మొక్కలను నాటాలి



పల్లె ప్రకృతివనంలో దగ్ధమైన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలి. మొక్కలు దగ్ధమైనందుకు కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. మా ప్రాంతంలో జింకలు అధికంగా ఉండడంతో పంటలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మొక్కలు పెరిగితే రైతుల పంటలకు నష్టం వాటిల్లదు.

– ఎర్ల రాజుయాదవ్, సరంపేట

నిర్లక్ష్యంగా నాటడంతోనే



విద్యుత్ తీగల కింద మొక్కలను నిర్లక్ష్యంగా నాటడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీంతో మొక్కలను నరికివేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో విద్యుత్ తీగలను చూసుకోకుండా నాటారు. ప్రజాధనాన్ని వృథా చేస్తే ఆ భారం మళ్లీ ప్రజలపైనే పడుతుంది. అన్ని విధాలుగా ఆలోచించే నిర్ణయాలు తీసుకుంటే ఇబ్బందులు తలెత్తేవి కావు.

– ఏర్పుల సురేష్, లెంకలపల్లి

ఉన్నతాధికారులకు సమాచారం అందించాం



పల్లెప్రకృతి వనంలో మొక్కలు దగ్ధమైన విషయమై ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశాం. అదే విధంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. మొక్కలకు నిప్పంటిచిన వారిపై చర్యలు తీసుకుంటాం. కాలిన మొక్కలను కాపాడేందుకు నీరు అందిస్తాం. పూర్తిగా దగ్ధమైన వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటేందుకు చొరవ చూపుతాం.

– జి.చినమునయ్య, ఎంపీడీఓ

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



చిట్యాల : ఉపాధి కూలీలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల : భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా నాయకుడు చెన్నోజు సాయికిరణ్‌చారి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని సుంకేనపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశివారులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుంగ రాజేందర్, ఆవుల స్వామిగిరి, బుంగ వంశీచరణ్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : భువనగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పాల్వాయి భాస్కర్‌రావు, మండల అధ్యక్షుడు కొరివి శంకర్, జిల్లా నాయకులు మేడబోయిన శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచార పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యకర్తలు ప్రతి గ్రామంలో సైనికులుగా పనిచేసి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేష్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, లింగస్వామి, నోముల నాగరాజు, చేపూరి రాజు, వడ్డేగోని రామలింగం, రమేష్, రాము, శేఖర్ ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

కేతేపల్లి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు చెరుకు రోశయ్య, బెజవాడ సతీష్, పిట్టల వెంకట్, రాచకొండ శ్రీనివాసరెడ్డి, నర్సింహాచారి, చంద్రశేఖర్, నరేష్, బొజ్జ సుధాకర్, గుండగోని నాగరాజు, కీసరి శంకరయ్య తదితరులు ఉన్నారు.



నార్కట్‌పల్లి : కరపత్రాలు విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

బీపీ మండల్‌కు ఘన నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : జాతీయ బీసీ కమీషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ వర్ధంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న మండల్ విగ్రహానికి బీసీ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగూరి నారాయణయాదవ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మునాస ప్రసన్నకుమార్, బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్, బత్తుల శ్రీనివాస్, వెంకన్న యాదవ్, సదాశివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంటలు అంటుకుని వరిగడ్డి దగ్ధం



దగ్ధమవుతున్న డీసీఎంలోని గడ్డి

చిట్యాల : గడ్డిలోడుతో వెళ్తున్న డీసీఎం వాహనానికి శనివారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని దగ్ధమయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుంకేనపల్లి గ్రామం నుంచి డీసీఎం వాహనం గడ్డిలోడుతో వెళ్తుండగా గ్రామశివారులోకి రాగానే విద్యుత్ తీగలు గడ్డికి తగిలి మంటలు లేచాయి. దీంతో వాహనంలోని గడ్డి దగ్ధమైంది. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సుమారుగా రూ.2లక్షల నష్టం వాటినట్లు బాధితులు తెలిపారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మర్రిగూడ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో టీఎస్‌యూటీఎఫ్ 11వ ఆవిర్భావ వేడుకలను మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలు అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పులిపాటి పరమేశ్వరి, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.యాదయ్య, సుందరయ్య, మంజుశ్రీన, సుధారాణి, రత్నకుమారి, నారాయణరెడ్డి, అభిలాష్, సులేమాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

నల్లగొండ రూరల్ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని అప్పాజిపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కల్వేటి రమాదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది కేవలం ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం రమాదేవి -విశ్వనాథ్ దంపతులు, సబార్డినేట్ బేగంను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, లక్ష్మీపతి, లక్ష్మణ్, శ్రీనివాసగౌడ్, శ్రీను, జంపాల మీనయ్య, రవీందర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఎం.మల్లికార్జున్, యాదగిరిరెడ్డి, సత్యనారాయణ, ఇందిర పాల్గొన్నారు.



నల్లగొండ రూరల్ : రమాదేవి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



చిట్యాల : హెచ్‌ఎంలను సన్మానిస్తున్న డీఈఓ

హెచ్‌ఎంలకు సన్మానం

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న కొండకింది అంజిరెడ్డి, జిల్లాలోని ఎర్రబెల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సాల్వాది శంకరయ్య ఈనెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీంతో నల్లగొండలోని పదోతరగతి స్పాట్ వాల్యువేషన్ కార్యక్రమంలో భాగంగా వారిని డీఈఓ భిక్షపతి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్ఞానప్రకాష్

కట్టంగూర్ : ఒండ్రు మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల గ్రామ పరిధిలోని మోదుగుచెరువులో ఉపాధిహామీలో చేపడుతున్న చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకొని మాట్లాడారు. కూలీలకు సరిపడా మౌలిక వసతులు కల్పించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధిహామీ పనుల ద్వారా చెరువుమట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీఓ రాంమోహన్, కార్యదర్శి అనిల్, ఎఫ్ఏ లక్ష్మణ్ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి



కట్టంగూర్ : మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

కట్టంగూర్ : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాడే భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం మండలంలోని మునుకుంట్లలో ఉపాధి కూలీలతో, ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, కట్ట బక్కయ్య, జాల రమేష్, యాదయ్య, కృష్ణ, ఆంజనేయులు ఉన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

శాలిగౌరారం : పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల పాల్గొని మాట్లాడారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులు కల్లూరి లింగయ్య, సైదుల శ్రీను, వెంకన్న, రామచంద్రు, లింగయ్య, లింగప్రసాద్, అవనిజ, మక్కా మేరమ్మ, జ్యోతి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం : ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అసంపూర్తి కాల్వలను పూర్తి చేస్తాం

చిట్యాల : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపిస్తే మండలానికి సాగు నీరు అందించే అసంపూర్తిగా ఉన్న ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల నిర్మాణాలను పూర్తి చేస్తామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, జిట్ట నగేష్ పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంలో జరిగిన పార్టీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బొబ్బలి సుధాకర్‌రెడ్డి, చొప్పరి లింగయ్య, పాలమాకుల అర్జున్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, సంధ్యారాణి, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలి

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : కార్యకర్తలు సమష్టిగా పనిచేసి నల్లగొండ పార్లమెంట్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. దొంగ హామీలు ఇచ్చి అమలు చేయని ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషిచేయాన్నారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ పంకజ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, ఆలకుంట్ల నాగరత్నరాజు, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, దేప వెంకటరెడ్డి, బకరం వెంకన్న, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వాటర్ కన్జర్వేషన్ అవార్డు



నల్లగొండ టౌన్ : అవార్డు అందుకుంటున్న న్యూస్ స్కూల్ యాజమాన్యం



మర్రిగూడ : అవార్డు అందుకుంటున్న పాఠశాల ప్రిన్సిపాల్ పాండరయ్య, ఉపాధ్యాయులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని న్యూస్ స్కూల్‌కు వాటర్ కన్జర్వేషన్ రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. జలమండలి సూచనల మేరకు, జల సంరక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల సూచనతో న్యూస్ స్కూల్ విద్యార్థులకు జల సంరక్షణపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జలమండలి, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థల సమన్వయంతో జల ప్రతిజ్ఞను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినట్లు గాంధీ సంస్థల వైస్ చైర్మన్, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జల సంరక్షణ కోసం వివిధ కార్యక్రమాలలో భాగస్వాములైన న్యూస్ స్కూల్ కరస్పాండెంట్ గంట్ల అనంతరెడ్డి వాటర్ కన్జర్వేషన్ -2024 అవార్డును అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ టి.సురేందర్, భూగర్భ జల విభాగం సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ యానాల రాధిక, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సీఈఓ చైతన్యరెడ్డి, పి.సాయి, పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగాయత్రి పాఠశాలకు..

మర్రిగూడ : మండల కేంద్రంలోని శ్రీగాయత్రి స్కూల్‌కు వాటర్ కన్జర్వేషన్ రాష్ట్ర స్థాయి అవార్డు లభించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అయితగోని పాండరయ్య తెలిపారు. శనివారం పాఠశాలలో ఆయన మాట్లాడారు. జలమండలి, ప్రభుత్వ సూచనల మేరకు జల సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల పిలుపుమేరకు శ్రీగాయత్రి స్కూల్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు జల సంరక్షణపై అవగాహన కల్పించామన్నారు. అందుకుగాను జలమండలి మమత ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండేషన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞానం ప్రతిష్ట సంస్థల సమన్వయంతో జల ప్రతిష్ట ఆధ్వర్యంలో జల ప్రతిజ్ఞలో తమ పాఠశాల పాల్గొన్నందున ఈ అవార్డును గాంధీ సంస్థల వైస్ చైర్మన్, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ముఖ్య నిర్వాహణ అధికారి టి.సురేందర్ పాఠశాల వద్ద ఈ అవార్డును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మమత ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ యానాల రాధిక, గాంధీ గ్లోబల్ సీఈఓ చైతన్యరెడ్డి, జాజాల రామకృష్ణ రఘు, మోర యాదయ్య, స్వాతి, వసంత, గోదాదేవి, సుహాసిని, ప్రేమలత, బాబు, మహేందర్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



నల్లగొండ టౌన్ : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని గడియారం సెంటర్, తిరుమల టాకీస్ వద్ద స్ఫూర్తి ఫౌండేషన్, త్రీడీ యూత్ నార్కట్‌పల్లి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ప్రారంభించారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాసరాజు సురేష్, దేవుని వెంకన్న యాదవ్, పైళ్ల శంకర్, జాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అందేరి మధు, గంగనబోయిన లోహిత్, తలారి సైదులు, కుసుకుంట్ల శివ, జూలకంటి రాజశేఖర్‌రెడ్డి, వెంకన్న పైళ్ల భాస్కర్, అక్కనపల్లి రాములు, బండమీది రంజిత్, రాజేష్ మహేష్, గణస్త్రష్, విజయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని నల్లగొండ చౌరస్తాలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌బాబు, ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, నాయకులు జేరిపోతుల భరత్, పైల భాస్కర్, పైల శంకర్, జక్కల రవి, గణేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

చందూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఇడెం రోజా, నామని జగన్నాధం, యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిషోర్, బండారు చంద్రయ్య, బొడిగే వెంకటేశం, కృష్ణ, అంజయ్య, శ్రీనివాస్, వెంకటేశం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గట్టుప్పల్ మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం



నార్కట్‌పల్లి : చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు, నాయకులు

పాఠాలు బోధించే వారేరీ..?

మర్రిగూడ : మండలంలోని వట్టిపల్లి గ్రామ పరిధిలో గల బట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 11మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆ పాఠశాలలో వారికి పాఠాలు బోధించేందుకు ఒక్కరే ఉపాధ్యాయురాలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఆ ఉపాధ్యాయురాలు ఆకస్మికంగా సెలవు పెట్టడంతో పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు కరువయ్యారు. చేసేది లేక విద్యార్థులు పాఠశాల సమయంలో పూర్తిగా ఆటల్లో నిమగ్నమయ్యారు. ఉపాధ్యాయురాలు సెలవు పెట్టడడంతో అందుబాటులో ఉన్న మరో ఉపాధ్యాయులను లేదంటే క్లస్టర్ సీఆర్‌పీలు పంపాల్సి ఉంటుంది. కాని ఉన్నతాధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మర్రిగూడ కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజయ్యను వివరణ కోరగా.. ఉపాధ్యాయురాలు సెలవు తీసుకుంటున్నట్లు ఆలస్యంగా తెలిపిందని, అప్పటికే ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఉపాధ్యాయులను పంపడం సాధ్యం కాలేదని, ఆమె ముందస్తు సమాచారం ఇస్తే పంపేవారిమని అన్నారు.



పాఠశాల సమయంలో ఆడుకుంటున్న విద్యార్థులు